ఉల్లాసంగా నేర్చుకోండి

● మహిళా అక్షరాస్యతపై దృష్టి
● ఉమ్మడి జిల్లాలో 71,522 మంది లక్ష్యం

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని మహిళల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. 2011 గణాంకాల ప్రకారం వీరి అక్షరాస్యత శాతం 49.87. గతంలో తెదేపా హయాంలో వెలుగు, ఉపాధి పథకాల కింద పలు కార్యక్రమాలు చేపట్టారు. అప్పటి గణాంకాల ప్రకారం ఎస్‌హెచ్‌జీల్లో 2,07,735 మంది, ఉపాధి వేతనదారుల్లో 3,24,085 మందిని గుర్తించి అక్షరాలు నేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు. వైకాపా ప్రభుత్వంలో ఇవన్నీ ఆగిపోయాయి.

గుర్తింపు ఇలా..

పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న సహాయకులు, వంట పనివారు, కాపలాదారులు, ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల్లో నిరక్షరాస్యులను గుర్తిస్తారు. ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ యాజమాన్యాలతో పాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకోనున్నారు. డీఆర్‌డీఏ పరంగా గ్రామైక్య సంఘాల వివరాలను వీవోఏ, సీసీలు సేకరించనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం ప్రతి పది మందికీ ఒక వాలంటీరును (సంఘంలో విద్యావంతులైన వారిని) ఎంపిక చేస్తారు. వయోజన విద్యాశాఖ ద్వారా పుస్తకాలు అందజేస్తారు. టీసీఎస్ కంపెనీ సహకారంతో ఫంక్షనల్, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించనున్నారు. ఈ అభ్యసన తరగతులు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరగనున్నాయి.

జిల్లాల వారీగా లక్ష్యం
విజయనగరం **48,578**
పార్వతీపురం మన్యం **22,944**

మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన 'ఉల్లాస్'(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)ను రాష్ట్రంలో ఉద్యమంగా నిర్వహించేలా చర్యలు చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలో అమలుకు సంబంధించి ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. నిరక్షరాస్యులైన 71,522 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. అయిదు నెలల పాటు ఈ యజ్ఞం సాగనుంది. 2025 మార్చి 31 నాటికి లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం


వయోజనులకు చదువు చెబుతున్న చిట్టి గురువులు (పాతచిత్రం)

7 శాఖల భాగస్వామ్యం

వివిధ శాఖల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. వయోజనవిద్య, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, డీపీవో, గ్రామ-వార్డు సచివాలయం, డీపీఆర్వో, విద్యాశాఖ అధికారులతో జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. వీరంతా అమలును పర్యవేక్షిస్తారు. దీనిపై శుక్రవారం సమావేశం కానున్నారు. వీరితో పాటు ప్రతి జిల్లాకూ ఒక నోడల్ అధికారి ఉంటారు. విజయనగరానికి వయోజన విద్య డీడీ అల్లు సోమేశ్వరరావు, పార్వతీపురం మన్యానికి వైకుంఠరావును (శ్రీకాకుళం జిల్లా వయోజన విద్య ఏడీ) నియమించారు.

ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యత శాతం

సంవత్సరం	అక్షరాస్యత	పురుషులు	మహిళలు
1981	21.74	12.55	22.47
1991	34.19	45.92	30.98
2001	51.07	62.37	39.91
2011	58.89	68.15	49.87

25 నుంచి శిక్షణ

ఈనెల 25న రాష్ట్రస్థాయిలో నిర్వహించే శిక్షణా తరగతులకు వయోజనవిద్య, డీఆర్‌డీఏ నుంచి ఇద్దరేసి అధికారుల చొప్పున ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లనున్నారు. తర్వాత ఎంపీడీవో, ఏపీఎంలకు జిల్లాస్థాయిలో, మండల స్థాయిలో సీసీ, వీవోఏ, వాలంటీర్లకు తరగతులుంటాయి. అనంతరం క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతాయని వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

రైతు బజార్లలో ప్రభుత్వ ధరలకే విక్రయాలు


జేసీకి వివరాలు చెబుతున్న మార్కెటింగ్ శాఖ అధికారి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు పెరగకుండా ఉండేందుకు సహకరించాలని సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ టోకు వర్తకులను కోరారు. టమాటా, ఉల్లి, బంగాళదుంపలు స్థానికంగా అందుబాటులో లేనందున.. అధిక లాభాల కోసం ఆలోచించకుండా సరమైన ధరలకు అందించాలన్నారు. గురువారం తన ఛాంబర్లో ధరల స్థిరీకరణ, పత్తి కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. రైతు బజార్లలో బియ్యం, కందిపప్పును నిర్ణయించిన ధరలకే విక్రయించాలని ఆదేశించారు. రాజాం, రామభద్రపురంలో నవంబరు రెండో వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. ముందుగా రైతు సేవా కేంద్రాల వారీగా అన్నదాతల జాబితాను సిద్ధం చేయాలని, కనీస మద్దతు ధర పొందేలా చూడాలని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, తూనిక యంత్రాలను తనిఖీ చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్, పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు, తూనికల కొలతల శాఖ సహాయ నియంత్రణాధికారి పి.వి.రంగారెడ్డి, ఉద్యాన, వ్యవసాయ శాఖల ఏడీలు శైలజ, అన్నపూర్ణ, రైతు బజారు ఎస్టేట్ అధికారులు, వర్తకులు పాల్గొన్నారు.

సమాజాన్ని చక్కదిద్దాల్సింది గురువులే

బొబ్బిలి, న్యూస్‌టుడే: సమాజాన్ని చక్కదిద్దాల్సింది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. గురువారం కోటలో బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం, సీతానగరం మండలాలకు చెందిన 100 మంది విశ్రాంత ఉపాధ్యాయులను ఏపీ ఎన్జీవో సంఘ నేత రౌతు రామ్మూర్తినాయుడు అధ్యక్షతన సన్మానించారు. ఎంతోమందికి విద్యను నేర్పి వారి బతుకుల్లో వెలుగులు నింపిన ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని బేబీనాయన అన్నారు. సెప్టెంబరు 5న ఏటా కోటలో సత్కరించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ ఏడాది వాయిదా పడిందని పేర్కొన్నారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు ఆర్.శరత్, మండలాధ్యక్షుడు వి.సత్యనారాయణ, సాయిరమేష్, నంది హరి ఉన్నారు.


సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బేబినాయన

నేడు మంత్రి పర్యటన

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం దత్తిరాజేరు, జామి, గంట్యాడ మండలాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు పాపయ్యవలస, 10కి భోజరాజపురం, 11కు దత్తి, మధ్యాహ్నం 3 గంటలకు పీఎస్ఆర్‌పురం, 4కు యాతపాలెంలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు.



● నీరు, ఆహారం కలుషితంతోనే వ్యాధి
● ఉమ్మడి జిల్లాలో కేసుల నమోదు
● గుర్ల ఘటనతో జాగ్రత్తలు తప్పనిసరి

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం లోపించినా, నీరు కలుషితమైనా, పాడైన ఆహార పదార్థాలు తిన్నా అతిసారం వచ్చే ప్రమాదం అధికం. ఈ వ్యాధి అప్పుడప్పుడు.. అక్కడక్కడ బయట పడుతుంది. ఒకేసారి ఎక్కువ మంది వ్యాధితో మంచాన పడినప్పుడే విషయం వెలుగులోకి వస్తుంది. లేకుంటే సాధారణ సమస్యగానే అందరూ చూస్తారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. మూడు లేక అంతకంటే ఎక్కువసార్లు వదులుగా విరేచనాలు అయితే అతిసారంగా భావించాలి. విజయనగరం జిల్లా గుర్లలో ఈ వ్యాధి సోకిన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు.

ఇవి తీసుకోవాలి

★ నీరసం రాకుండా ఓఆర్ఎస్ తాగించాలి.
★ విరేచనాలు తగ్గడానికి జింక్ మాత్రలివ్వాలి.
★ విరేచనాలు తగ్గిన తర్వాత కూడా రెండు వారాల వరకు రెట్టింపు ఆహారం ఇవ్వాలి.
★ ప్రమాద స్థితిలో వైద్యుడిని లేదా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలి.
★ యాంటీ బయోటిక్ మందులు వాడరాదు.

అది లేనప్పుడు ఏం చేయాలి?

★ ఓఆర్ఎస్ లేనప్పుడు ఇంట్లోని కొన్ని ద్రవ పదార్థాలు ఇవ్వవచ్చు.
★ పాలు తాగే పిల్లలకు తల్లి పాలు ఎక్కువసార్లు ఇవ్వాలి. ★ ఉప్పు, పంచదార నీరు, కొబ్బరి నీరు, గంజి, సగ్గుబియ్యం జావ, మజ్జిగ, నిమ్మకాయ రసం, పప్పునీరు ఇవ్వవచ్చు.

ఓఆర్ఎస్ ప్రాణరక్షణి

చప్పగా, ఉప్పగా ఉందని.. తాగడానికి ఇష్టపడక పక్కన పెట్టేస్తారు చాలా మంది. అతిసారం బారిన పడ్డ వారికి అత్యంత ప్రాణరక్షణిగా పనిచేసేది ఓఆర్ఎస్ ద్రావణమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. సులభంగా, ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో దొరికే ఈ పొట్లాలు అంటే చాలా మందికి చిన్న చూపు అని చెప్పవచ్చు. అతిసారం బారిన పడ్డ వారిని తిరిగి సాధారణ స్థాయికి తీసుకువచ్చే అమృతం ఇదేనని వైద్యులంటున్నారు.

ఇవ్వకూడనివి

★ గ్లూకోజ్, పండ్ల రసాలు, శీతల పానీయాలు

వైద్యుడ్ని ఎప్పుడు సంప్రదించాలి

★ వాంతులు, విరేచనాలు ఎక్కువగా అయినప్పుడు.
★ స్పృహలో లేకపోయినా..
★ మూత్రం తక్కువగా అయినప్పుడు.
★ విరేచనాల్లో రక్తం, చీము పడినప్పుడు.
★ చాలా నీరసంగా ఉన్నప్పుడు.
★ జ్వరం వచ్చినప్పుడు.
★ కడుపు పొంగినప్పుడు.

విరేచనాలు తగ్గిన తర్వాత

★ కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
★ రెండు వారాల వరకు ఆహారం ఎక్కువసార్లు తినిపించాలి. ★ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
★ నీటిపై, ఆహారంపై తప్పకుండా మూతలు పెట్టాలి.

ఇదిగో అంటూనే.. వదిలేశారు నాలుగేళ్లు

● సగం కూడా పూర్తి కాని గృహాలు ● మార్చిలోగా కావాల్సిందేనని కేంద్రం గడువు

ఈనాడు-విజయనగరం

ఇక గూడు లేని పేదలు ఉండరు. రికార్డు స్థాయిలో ఇళ్లు నిర్మించి వారికి అప్పగిస్తాం. గత వైకాపా ప్రభుత్వ మాట ఇది.

కానీ..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పేదలకు గృహాలు మంజూరు చేసిన వాటిలో సగం కూడా పూర్తి చేయలేకపోయారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం గృహాలు మంజూరు చేసింది. తొలుత ఆసక్తి చూపిన లబ్ధిదారులు తర్వాత వెనుకంజ వేశారు. ఊరికి దూరంగా లేఅవుట్లు వేశారని కొందరు.. అనువుగా లేని చోట్ల గృహాలు నిర్మించుకోమంటే ఎలా అని మరికొందరు ప్రశ్నించారు. అప్పటికే ఎక్కడెక్కడో ఇళ్ల స్థలాల కొనుగోలులో నాలుగు రాళ్లు వెనకేసుకున్న వైకాపా నేతలు పేదలను పట్టించుకోలేదు.

తప్పని తిప్పలు

కేంద్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అందించిన రూ.1.80 లక్షలు చాలవని, సొంతంగా పెట్టుబడి పెట్టలేమని చాలా మంది చేతులెత్తేశారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందించకపోగా.. కేంద్రం విడతల వారీగా విడుదల చేసిన బిల్లులకు సంబంధించిన నిధులు దారి మళ్లించింది. దీంతో చేసిన పనులకు సకాలంలో బిల్లులు పాసవ్వలేదు. ఉచిత సరఫరా అంటూనే సకాలంలో ఇసుక ఇవ్వలేదు. లేఅవుట్లలో కనీస వసతులు కల్పించలేదు. గత డిసెంబరు నుంచి జిల్లాల వారీగా లక్ష్యాలు ప్రభుత్వం ఇచ్చి పనులు పూర్తి కాకున్నా మెగా గృహ ప్రవేశాలు చేసింది. ఇప్పటికీ అందులో నివాసానికి చాలా మంది మొగ్గు చూపడం లేదు.

జిల్లాలో ప్రగతి ఇదీ మంజూరు: **81,999** పూర్తి: **45,507**


బొబ్బిలిలోని రామన్నదొరవలస లేఅవుట్‌లోని గృహాలు

కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు, మరికొన్ని చోట్ల రూ.కోట్లు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసి లేఅవుట్లు వేశారు. వాటికి జగనన్న కాలనీలని పేరు పెట్టుకున్నారు. కొంత మంది పేదలకు సొంత స్థలాల్లో, లేని వారికి లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతిచ్చారు. అప్పట్లో రాజకీయ లబ్ధి పొందాలనే దురాలోచనతో అనర్హులకు సైతం నివాస స్థల పట్టాలు, ఇళ్లు మంజూరు చేశారు.

పరీక్షించిన తర్వాతే బిల్లులు

ప్రస్తుతం ఇళ్ల పనులు పరీక్షించిన తర్వాతే అధికారులు బిల్లులు చేస్తున్నారు. ఇసుక, ఇటుక, పిక్కరాయి, స్లాబ్, క్యూరింగ్, పని నాణ్యత పరిశీలిస్తున్నారు. ఇందుకు ఆప్కాస్ సంస్థను థర్డ్ పార్టీ విజిలెన్స్ వేసింది. గతంలో బిల్లులు చెల్లించిన తర్వాత నాణ్యత పరీక్షలు చేసేవారు. దీనికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. శతశాతం లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత సంపూర్ణంగా మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటి వరకు పనులకు అవసరమయ్యేలా నీరు, విద్యుత్తు సరఫరా వంటి వసతులు కల్పించింది. లబ్ధిదారుల్లో అనర్హులను ఏరివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు ప్రత్యేక యాప్ అమలు చేస్తోంది. ఆన్‌లైన్ పరిశీలనలో విజయనగరం జిల్లాలో 2,060 మంది, మన్యం జిల్లాలో వంద మందికి పైగా అనర్హులు ఉన్నారని గుర్తించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వారీగా ఇంకా పరిశీలన జరుగుతోంది. వారి ఆదాయ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత మరికొందరు అనర్హులు తేలే అవకాశం ఉంది.

శతశాతం పూర్తి చేస్తాం

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లు పూర్తికి మార్చి 25 తుది గడువు. ఈలోగా అన్నీ పూర్తి చేసేందుకు లబ్ధిదారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాం. సొంత స్థలాలు ఉన్న వారు చేపట్టిన పనుల్లో ప్రగతి ఆశాజనకంగా ఉంది. ఆప్షన్ 2, ఆప్షన్ 3లో వెనుకబడి ఉంది.
– పి.కూర్మినాయుడు, పీడీ, గృహ నిర్మాణ సంస్థ

నాగావళి పరవళ్లు

అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగావళిలో ప్రవాహం పెరిగింది. గురువారం నదిలో 10,500 క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, నదిలో స్నానాలు, ఈతకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. సాయన్నగెడ్డ, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి.
– న్యూస్‌టుడే, సంతకవిటి



జలమే కాలకూటమా

● ఇంకా అందని నీటి నిర్ధారణ పరీక్షలు

న్యూస్‌టుడే, గరివిడి, గుర్ల

గుర్లను వణికిస్తున్న డయేరియా మహమ్మారికి కలుషిత నీరే కారణమని అధికార యంత్రాంగం భావిస్తోంది. అయితే.. అసలు తాగునీరు ఎక్కడ ..? ఎలా కలుషితమైంది..? అందుకు దారితీసిన కారణాలేమిటి? అన్నది ఇంకా నిర్ధారించలేకపోతోంది.

మరో వైపు మరణ మృదంగం ఆగడం లేదు. బాధితుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటికే ఐదుగురు మృతి చెందగా గురువారం మరో ఇద్దరు చనిపోవడంతో మృతుల సంఖ్య ఏడుకు పెరిగింది. ఇప్పటికే 143 మంది బాధితులు నమోదు కాగా కొత్తగా మరో ఎనిమిది కేసులు చేరాయి.


చంపావతి నదిలో గుర్లకు నీరందించే ఊటబావి

ఆ ట్రయిల్ రన్ వల్లే జరిగిందా..

గుర్ల గ్రామానికి ఎస్ఎస్ఆర్ పేట సమీపంలో చంపావతిలో ఉన్న నీటి పథకం ఊటబావి ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేశారు. కుళాయిలకు తాగునీరు సరఫరా కాకపోవడంతో కొన్ని రోజుల కిందట గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అందించడానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ట్రయల్ రన్ వేసినట్లు చెబుతున్నారు. అప్పటికే వర్షాల కారణంగా వరద నీరు, కొట్టుకొచ్చిన వ్యర్థాలు చంపావతిలో చేరాయి. అదే సమయంలో ట్రయల్ రన్ ద్వారా ఆ నీరు ఇంటింట కుళాయిలకు సరఫరా చేయడం కారణంగా అతిసారం ప్రబలిందా? అన్న అనుమానాలు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు ఆ నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపామని, ఇంకా ఫలితాలు రావాల్సి ఉందని చెబుతున్నారు. పాత పైపులైన్ల లీకేజీల కారణంగా కూడా కలుషితం అయి ఉంటుందేమోనని, దానికి బదులు ప్రత్యామ్నాయంగా కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో పలు బోరుబావుల నుంచి సేకరించిన నీటి నమూనాల్లో కొన్నింట్లో భూగర్భ జలాలు కలుషితమైనట్లు ఫలితాలు వచ్చాయని చెబుతున్నారు. ఎక్కడ నీరు కలుషితమైంది.. కారణాలేమిటి అన్నది పూర్తిగా నిర్ధారణ అయ్యాక నివారణ చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

బాధితులకు మెరుగైన సేవలు

గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలో బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్య శిబిరాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం సందర్శించారు. వ్యాధికి కారణాలు తెలుసుకున్నారు. రోగులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి నాణ్యతపై నివేదికలు రావాల్సి ఉందని, గ్రామస్థులకు ట్యాంకులతో నీరు సరఫరా చేస్తున్నామని, గ్రామంలో నీటిని ఎవరూ వాడొద్దన్నారు. చంపావతి పరిసరాల్లో వ్యర్థాలు నీటి కలుషితానికి కారణంగా భావిస్తున్నట్లు చెప్పారు. సమగ్ర నివేదిక ఇవ్వాలని డీపీవో వెంకటేశ్వరరావును ఆదేశించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టరు పద్మావతి వైద్య శిబిరంలో సేవలపై ఆరా తీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకరరావు ఉన్నారు.


చికిత్స పొందుతున్న యువకుడితో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

మంత్రి దృష్టికి తీసుకెళ్లా: ఎంపీ

ఈనాడు, విజయనగరం: గుర్లలో డయేరియా విజృంభణపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా ఆదేశాలు ఇస్తానని మంత్రి తనతో చెప్పారన్నారు. దిల్లీ నుంచి గురువారం ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. నాలుగు రోజుల వ్యవధిలో ఆరుగురు మృతి చెందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులను జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులకు తరలించేందుకు గ్రామంలో వైద్య శిబిరం వద్ద అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు.

అదుపులోకి రాని డయేరియా

గుర్ల, న్యూస్‌టుడే: గుర్లను అతిసారం వణికిస్తోంది. ఈ నెల 13న ఒకరు, 15న నలుగురు ప్రాణాలు కోల్పోయారు. గురువారం మరో ఇద్దరు మృతి చెందారు. గుర్ల పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో 22 మంది, చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో ఏడుగురు, విజయనగరం సర్వజన ఆసుపత్రిలో 18 మంది, విశాఖ కేజీహెచ్‌లో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. బుధవారం గ్రామానికి చెందిన బోడసింగి రాములమ్మ (65) వాంతులు, విరేచనాలతో శిబిరంలో చేరారు. ఈమెకు చికిత్స అందించగా సాయంత్రం కోలుకొని ఇంటికి వెళ్లారు. గురువారం మరోసారి వాంతులు చేస్తూ ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వరుస ఘటనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



రాములమ్మ (పాతచిత్రం)

మరో మహిళ

మండలంలోని కోటగండ్రేడులో ఎం.అప్పలనర్సయ్యమ్మ (57) మరణించారు. ఇటీవల అతిసారం బారినపడిన ఆమెను చికిత్స నిమిత్తం గుర్ల పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి చెన్నయ్ వివరాల ప్రకారం.. ఈమె గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు.

పెళ్లి మండపం నుంచి ఆసుపత్రికి వరుడు

అతిసారంతో ఓ వరుడు పెళ్లి మండపం నుంచి ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గుర్లకు చెందిన మామిడిపాక ప్రవీణ్‌కుమార్ వివాహం బుధవారం రాత్రి సింహాచలంలో జరిగింది. వధూవరులకు పురోహితుడు అరుంధతి నక్షత్రం చూపిస్తుండగా ప్రవీణ్‌కుమార్ వాంతులు చేస్తూ కుప్పకూలిపోయాడు. బంధువులు వెంటనే విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని సోదరుడికి సైతం వాంతులు కావడంతో ఆసుపత్రిలో చేర్చారు. ఇద్దరూ ప్రస్తుతం కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.


రోగులతో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ డైరెక్టరు పద్మావతి

గ్రామస్థులు సహకరించాలి

ఈనాడు, విజయనగరం: గుర్లలో డయేరియా అదుపునకు గ్రామస్థులు సహకరించాలని.. ఈ వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరూ వైద్యులను సంప్రదించాలని చీపురుపల్లి శాసనసభ్యుడు కిమిడి కళావెంకటరావు సూచించారు. గురువారం మరొకరు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. అవసరమైన వారిని జిల్లా కేంద్రంలోని మహారాజా ఆసుపత్రికి తరలిస్తామని చెప్పారు. చీపురుపల్లి నుంచి సరఫరా చేస్తున్న రక్షిత తాగునీటినే తాగాలని, గుర్ల వైద్య శిబిరంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామని వివరించారు. అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

సంస్కృత కళాశాలలో దూరవిద్య కేంద్రం

విద్యావిభాగం: మహారాజా సంస్కృత కళాశాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దూరవిద్య కేంద్రాన్ని(స్టడీ సెంటర్) ప్రారంభించినట్లు కళాశాల ప్రధానాచార్యుడు డా. జి.జనార్దననాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని, నవంబరు 15 వరకు అవకాశముందని చెప్పారు. వివరాలకు 94920 21464 నంబరును సంప్రదించాలని కోరారు.



అరకు వ్యాలీలో హెలీప్యాడ్ సేవలు ప్రారంభించాలని ఎంపీ కలిశెట్టి కోరారు. దిల్లీలో గురువారం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. పర్యాటకుల ఇబ్బందుల నేపథ్యంలో ఈ ప్రతిపాదనను పరిశీలించాలని విన్నవించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

మామిడి చెట్టుకు 15 రకాల కాయలు

మందార మొక్కకు 20 రకాల పూలు

తురాయిపువలస నర్సరీలో వినూత్న ప్రయోగం



అంటు కట్టిన మందార మొక్కలను చూపిస్తున్న ఉద్యానశాఖ అధికారి కాంతారావు

నచ్చిన మామిడి పండ్లను ఇంట్లోనే పండించి తినొచ్చు.. ఇష్టమైన పూలను పెరట్లోనే పెంచి కోసుకోవచ్చు.. దీని కోసం వందల చెట్లు, మొక్కలు అవసరం లేదండోయ్.. ఒక్క మామిడి చెట్టు నుంచే వివిధ రకాల పండ్లను పొందవచ్చు. అలాగే ఒకే మందారం చెట్టు నుంచి నచ్చిన పూల రకాలను పెంచుకోవచ్చు. ఈ అరుదైన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏకు చెందిన తురాయిపువలస ఉద్యాన క్షేత్రం అధికారులు. మిక్స్‌డ్ పేరుతో అంట్లు కట్టే విధానాన్ని ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా కొన్ని రోజులుగా వీటి తయారీకి చర్యలు చేపట్టారు. ఒకే చెట్టుకు 15 నుంచి 20 రకాల మామిడి కాయలు, మందార మొక్కకు సుమారు 20 రకాల పూలు పూసేలా సిద్ధం చేస్తున్నారు.

కుండీలుంటే చాలు..

అవసరం మేర ఈ మొక్కలను నాటుకోవచ్చు. స్థలం లేకపోతే పెద్ద కుండీల్లోనూ పెంచుకోవచ్చు. అంటు కట్టిన మందారం మొక్క నుంచి మూడు నెలల్లోనే నచ్చిన పూలు వస్తాయి. మామిడికి సంబంధించి రెండేళ్ల పాటు పూతను తొలగించాలని, మూడో ఏడాది నుంచి కాపునకు వదిలేయాలని ఉద్యానశాఖ అధికారి కె.కాంతారావు తెలిపారు. ప్రస్తుతం రెండేసి వేల చొప్పున తయారు చేస్తున్నామని, మరో రెండు నెలల్లో మందార మొక్కలను సరఫరా చేస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో నిమ్మ, బత్తాయిపై కూడా ప్రయోగాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సాధారణంగా రెండు మూడు రకాలతో అంటు నాటుతారని, కానీ తాము అత్యధికంగా 20 రకాలతో మొక్కలను తయారు చేస్తున్నామన్నారు. ఈ విధానంతో నచ్చిన పండ్లు, పూలు ఇక్కడే అందుబాటులో ఉంటాయని చెప్పారు. – న్యూస్‌టుడే, సీతంపేట



అంటు కట్టిన మామిడి మొక్క

రూ.50 వేల రాయితీతో ఎస్సీ, ఎస్టీలకు రుణాలు

నవంబరు నుంచి లబ్ధిదారుల ఎంపిక, మంజూరు

– న్యూస్‌టుడే, మయూరికూడలి

ఎస్సీ, ఎస్టీ వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే ఉన్నతి పథకం నుంచి రుణాలు అందిస్తోంది. మరోవైపు పొదుపు సభ్యులకు రుణ పరపతిని సైతం పెంచింది. రూ.50 వేల నుంచి రూ.5 లక్షలు చేసింది. ఈక్రమంలో రూ.50 వేల వరకు రాయితీతో కొత్తగా రుణాలిచ్చేందుకు ప్రణాళికలు వేస్తోంది. ఈ ఏడాది నుంచి అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు వచ్చేనెల నుంచి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో 67,250కు పైగా సంఘాలు ఉండగా.. వాటిలో 18 శాతం వరకు ఎస్సీ, ఎస్టీ సంఘాలున్నాయి. ప్రస్తుతం ఉన్నతి పథకం ద్వారా వీరికి పూర్తిగా వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారు. ఈ ఏడాది విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 2800 మందికి రూ.14 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటివరకు విజయనగరంలో 1200 మందికి రూ.6 కోట్లు, మన్యంలో 168 మందికి రూ.1.52 కోట్లు ఇచ్చారు. పలువురికి జీవనోపాధుల కింద యూనిట్లు మంజూరు చేశారు. వెలుగు, అంతర్గత, సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధితో పాటు అదనంగా రాయితీ రుణాలు ఇవ్వనున్నారు.

ఈ ఏడాది లక్ష్యం(రూ.కోట్లలో)

జిల్లా	సభ్యులు	రుణం
విజయనగరం	1800	9
మన్యం..	1000	5



ఉన్నతి రుణాల సద్వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సభ్యురాలు

వర్తింపు ఇలా..

కొత్త విధానంలో భాగంగా సభ్యురాలు ఎంత తీసుకున్నా.. రాయితీ వర్తించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఈ నిధులను సమకూర్చనున్నారు. ఈమేరకు ఉన్నతి పథకాన్ని సదరు కార్పొరేషన్‌కు అనుసంధానించనున్నారు. అందులో భాగంగా ప్రతి యూనిట్‌కు రూ.50 వేల సబ్సిడీ దక్కుతుంది.

గరిష్ఠంగా రూ.5 లక్షలు..

ప్రభుత్వ ఆదేశాలతో లబ్ధిదారులకు కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు ఇవ్వనున్నారు. ఈ రుణంతో సుమారు 112 జీవనోపాధులకు చెందిన యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి. చిరు పరిశ్రమలు కూడా పెట్టుకోవచ్చు. వెలుగుశాఖ ద్వారా ముందుగానే దరఖాస్తులు తీసుకోవాల్సి ఉంటుందని డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రుణం పొందాక సొంతానికి వాడుకోకుండా తప్పనిసరిగా యూనిట్ ప్రారంభించాలని స్పష్టం చేశారు. వారికే రాయితీ దక్కుతుందన్నారు. సబ్సిడీ పథకానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైందన్నారు.

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి, కలెక్టర్ తదితరులు

ఉడాకాలని, న్యూస్‌టుడే: రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహర్షి జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగారాజు, కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్వో అనిత, బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులివ్వాలి

ఉడాకాలని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి సింగిల్ విండో విధానాన్ని పక్కాగా అమలు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. పారిశ్రామిక వేత్తలు, ఆశావహులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, విద్యుత్తు, అగ్నిమాపక, రెవెన్యూ తదితర శాఖల వద్ద దస్త్రాలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రతి జిల్లాకూ ఒక ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలని విన్నవించారు. నాయకులు రామచంద్రరాజు, రామ్మోహన్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

ఆదాయం వస్తున్నా.. చేకూరని ప్రయోజనం

కమిటీల ఆర్జన ఇలా..

- మార్కెట్ కమిటీల సంఖ్య : 8
- ఈ ఏడాది లక్ష్యం: రూ.12.84 కోట్లు
- ఇంతవరకు వసూలు : రూ.3 కోట్లు
- గత అయిదేళ్లలో సెస్సు: రూ.77.07 కోట్లు

బొబ్బిలి, న్యూస్‌టుడే: రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెట్ కమిటీలు ముక్కు పిండి రెండు శాతం పన్ను వసూలు చేస్తున్నాయి. కానీ వారి సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశాయి. గత అయిదేళ్లలో సుమారు రూ.77 కోట్ల ఆదాయం సమకూరినా గోదాములు, అనుబంధ రహదారులు, ఇతర ప్రయోజన పథకాలకు ఖర్చు చేసింది నామమాత్రమే. ప్రస్తుతం ఆయా నిధులు ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. ఈక్రమంలో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం కమిటీల పాలక వర్గాల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది.

దళారులే దిక్కు

వ్యవసాయ ఉత్పత్తులను దళారులకు అమ్ముకుండా కమిటీల్లో కుదువ పెట్టుకుని రుణం తీసుకునే 'రైతుబంధు' పథకం అమలు కావడం లేదు. పంట విలువలో 80 శాతం వరకు రుణం ఇచ్చే అవకాశం ఉంది. ధర వచ్చాక పంటను విక్రయించి రుణాలను తీసుకునే వెసులుబాటు కమిటీలు కల్పించాలి. జిల్లాలో 8 కమిటీలున్నాయి. వీటి పరిధిలో సుమారు లక్ష మంది అన్నదాతలు ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరికీ ప్రయోజనం చేకూరలేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.



తెర్లాం మండల కేంద్రానికి సమీపంలో ఖాళీగా ఉన్న కమిటీ స్థలంలో గోదాం నిర్మాణానికి పడిన అడుగులు

గిడ్డంగులు, గోదాములేవీ..

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను కల్లాలు, ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా పొలాలకు లింకు రహదారులు ఏర్పాటు చేయాలి. గతంలో ఒక్కో కమిటీ పరిధిలో 30 శాతం నిధులు ఇందుకు కేటాయించారు. ఒక్కో కమిటీ పరిధిలో రైతుల అభిప్రాయాలను తీసుకుని ప్రాధాన్యత మేరకు ఏడాదికి 10 నుంచి 15 రహదారులు వేసేవారు. గత ఐదేళ్లలో ఒక్క రహదారి కూడా వేయలేదు. రైతులు ఉత్పత్తులు దాచుకుని ధర ఉన్న సమయంలో అమ్ముకునేందుకు శీతల గిడ్డంగులు నిర్మించలేదు. తడిసిపోయిన పంటను ఆరబెట్టుకొనేందుకు ప్లాట్‌ఫారాలు నిర్మించలేదు. అవి ఎక్కడా కానరావు. అన్నింటికీ ప్రభుత్వానికే ప్రతిపాదనలు పంపించి చేతులు దులిపేసుకున్నాయి. మార్కెట్ కమిటీల్లో సంతలు నిర్వహించి రైతుకు కావాల్సిన వ్యవసాయ ఉపకరణాలు సరసమైన ధరలకు దొరికేలా చూడాలి. వ్యాపారులను తీసుకువచ్చి లావాదేవీలు జరపాలి. వాటి దాఖలాలు లేవు.

వైద్య శిబిరాలు జాడేదీ? పాడి సంపద అభివృద్ధికి మార్కెట్ కమిటీలు పెద్ద పీట వేసి.. ఏడాదికి నాలుగు పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసే వారు. ఒక్కో శిబిరానికి రూ.20 వేల వరకు ఖర్చు చేసేవారు. ఐదేళ్లుగా వీటి నిర్వహణ లేదు. వ్యాధులతో బాధపడుతున్న పశువులకు సంపూర్ణ వైద్యం అందించి, మందులను చేసే వారు. గత ప్రభుత్వంలో అవన్నీ ఎత్తేశారు.

ప్రతిపాదనలు సిద్ధం

రైతు సంక్షేమ పథకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. అనుబంధ రహదారులు, గిడ్డంగుల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. మార్కెట్ కమిటీల పరిధిలో వచ్చే ఆదాయం రైతుల సంక్షేమానికి ఖర్చు చేయనున్నాం.
– రవికృష్ణ, ఏడీ, మార్కెటింగ్‌శాఖ



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

పైడితల్లికి పెద్దఎత్తున కానుకలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం స్థానిక అమ్మవారి కల్యాణ మండపంలో లెక్కించారు. జాతర నేపథ్యంలో పెద్దఎత్తున కానుకలు వచ్చాయి. 14 రోజులకు గానూ చదురుగుడి నుంచి రూ. 45,02,250 నగదు, 40.800 గ్రాముల బంగారం, 955 గ్రాముల వెండి, 45 రోజులకు గానూ వనంగుడి నుంచి రూ.11,41,151 నగదు, 6.500 గ్రా. బంగారం, 73 గ్రా. వెండి, 21 అమెరికన్ డాలర్లు, రూ.50 వేల విలువైన ఇండోనేషియా నోట్లు వచ్చినట్లు దేవస్థానం ఈవో ప్రసాదరావు తెలిపారు. మాన్సాస్ ట్రస్టు డిప్యూటీ కమిషనర్ కేఎన్‌డీవీ. ప్రసాదరావు పర్యవేక్షించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	142	254	264

ప్రాణం తీసిన రహదారి

అదుపుతప్పి కానిస్టేబుల్ మృత్యువాత



బుల్లిబాబు (పాతచిత్రం)

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: అధ్వాన రహదారి.. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఓ పోలీసు కానిస్టేబుల్ నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. విధి నిర్వహణకు వెళ్తున్న ఆయన రాళ్లు తేలిన మార్గంలో అదుపుతప్పి మృత్యువాత పడిన ఘటన కురుపాం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నీలకంఠరావు వివరాల మేరకు.. పాలకొండ సమీపంలోని గొట్టమంగళాపురానికి చెందిన కె.బుల్లిబాబు(48) జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్సులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈయన శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో నివాసం ఉంటున్నారు. విధుల్లో భాగంగా గురువారం గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్‌పేటకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కురుపాం మండలంలోని జరడ- నీలకంఠాపురం ఘాట్ మార్గంలో అదుపుతప్పి పడిపోయారు. తల రహదారికి బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాన్ని భద్రగిరి ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిపాదనలు పంపించినా..

కురుపాం మండలంలోని నీలకంఠాపురం నుంచి జరడ గ్రామానికి 9 కిలోమీటర్ల పొడవున రోడ్డు ఉంది. ఏళ్ల క్రితం నిర్మించడంతో ప్రస్తుతం చాలా చోట్ల తారు ఊడిపోయింది. ఎక్కడికక్కడే కోతకు గురైంది. రాళ్లు తేలి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఇప్పటికే పలువురు ఈ మార్గంలో అదుపుతప్పి గాయాల పాలైన ఘటనలు నమోదయ్యాయి. ఈ ఏడాది మార్చిలో ఉపాధి పనుల్లో భాగంగా రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లతో అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఐటీడీఏ జేఈ అప్పారావు తెలిపారు. అయినా నిధులు మంజూరు కాలేదని ఆయన తెలియజేశారు.



నీలకంఠాపురం- జరడ ఘాట్ మార్గం

తొలి చూపే.. చివరిదైంది

కుమారుడ్ని చూసేందుకు వచ్చి దుర్మరణం



సింహగిరి (పాతచిత్రం)

కొమరాడ, న్యూస్‌టుడే: కుటుంబ పోషణ కోసం పొరుగు రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు.. భార్య ప్రసవించినా.. సెలవులు దొరకకపోవడంతో సకాలంలో ఇంటికి రాలేకపోయారు. ఎట్టకేలకు దాదాపు మూడు వారాలు దాటాక స్వగ్రామానికి చేరుకున్నారు. కుమారుడ్ని కళ్లారా చూశారు. కానీ ఆ సంతోషం ఎంత సేపూ నిలవలేదు. చెరువు రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ఘటనలో హోంగార్డు దుర్మరణం చెందారు. ఏఎస్సై నాయుడు వివరాల ప్రకారం.. కొమరాడ మండలం చంద్రంపేట గ్రామానికి చెందిన జి.సింహగిరి(42) తెలంగాణలోని ఖైరతాబాద్ పోలీసు ఠాణాలో హోంగార్డుగా పనిచేస్తున్నారు. అతని భార్య భారతి ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చారు. దీంతో సింహగిరి సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. గురువారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని చెరువుకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ అందులో పడి మరణించారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా.. ఈక్రమంలో చెరువులో విగతజీవిగా కనిపించారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బొండపల్లి మండలానికి చెందిన ఎర్రినాయుడు(44) విజయనగరంలోని సీఎంఆర్ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా ఆర్టీవో కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంతో వస్తూ ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎర్రినాయుడును స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. గురువారం వేకువజామున మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ ఎస్సై నరేష్ తెలిపారు.

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

నిధులు విడుదల సులభతరంతోనే 'పల్లె పండగ'



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, బొండపల్లి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వానికి భిన్నంగా.. ఉపాధి నిధులను రాష్ట్రస్థాయి కేటాయింపుల నుంచి జిల్లాల వారీగా అందేలా చేసి పల్లెల్లో వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు సర్కారు తీసుకున్న నిర్ణయమే 'పల్లె పండగ' కార్యక్రమమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం మండలం పురిటిపెంట, జిన్నాం, మరుపల్లి గ్రామాల్లో గురువారం జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని, పలు పనులకు శంకుస్థాపన చేశారు. గత ఐదేళ్లు పల్లెల్లో సౌకర్యాలు లేవని, వాటిని ప్రజలకు అందించేందుకు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వం తొలి సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఏడు నెలలు పడితే, చంద్రబాబు తొలి సంతకంతో సంక్షేమాన్ని అందించారన్నారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎం.శ్రీధర్, పీడీసీ గోపాలరాజు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బొండపల్లి మండలంలో రూ.2 కోట్లతో కొణిస-గొల్లుపాలెం రహదారి పనుల్ని మంత్రి ప్రారంభించారు. రూ.77 లక్షలతో మరువాడ, ఎం.కొత్తవలస గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు పూజలు చేశారు. సర్పంచులు పోతల రమణమ్మ, డి.పార్వతి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



అమ్మవారికి లక్ష పసుపు కొమ్ములతో అర్చన

గరివిడి, బొబ్బిలి, గ్రామీణం, గజపతినగరం, న్యూస్‌టుడే: గరివిడి శ్రీ విద్యా సౌరాక్ష్ణ పీఠం(సూర్యనారాయణ)లో అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మహా త్రిపుర సుందరి దేవికి లక్ష పసుపు కొమ్ములు, 250 సువాసినితో అర్చన చేశారు. ● నడిమిని ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి, మల్లంపేట, పాతబొబ్బిలి, మండలంలోని పక్కి, పిరిడి తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి విగ్రహాలను ఊరేగించి ఆలయాల వద్ద ప్రతిష్ఠించారు. ● గజపతినగరం మండలంలోని పురిటిపెంట గ్రామంలో బంగారమ్మ పండగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు జరిగింది.



పక్కిలో నడిమిని విగ్రహాల ఊరేగింపు

ప్రజలకు మెరుగైన సేవలు

తెర్లాం, న్యూస్‌టుడే: ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని ప్రత్యేకాధికారి వీడీ రామారావు అన్నారు. గ్రామ సందర్శనలో భాగంగా లోచర్లలో పర్యటించి, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. పాఠశాల, ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. సర్పంచి ఆదిలక్ష్మి, ఎంపీడీవో రేగి రాంబాబు, పంచాయతీ విస్తరణాధికారిణి నిలిమతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	-80085 74367
గజపతినగరం	-80085 74332
రాజాం	-80085 74308
గరివిడి	-80085 74348

? తారాపురం గ్రామ ఎస్సీ కాలనీలో చెత్త పేరుకుపోయింది. దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు**

● చెత్తను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. - **వెంకటరమణ, ఈవోపీఆర్డీ**
- న్యూస్‌టుడే, రామభద్రపురం

? గజపతినగరం ప్రధాన వీధిలో పైపులైను లీకుతో రెండు రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. కొళాయి వీధిలోనూ లీకేజీలు ఉన్నాయి. - **స్థానికులు**

● లీకులు సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **జనార్దనరావు, గ్రామ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, గజపతినగరం

? నరవ-నీలావతి రహదారిపై వ్యర్థాలు వేసి, దుర్గంధం వెదజల్లుతోంది. వర్షం పడితే రాకపోకలు చేయలేకపోతున్నాం. - **ప్రయాణికులు**


● పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి చెత్తను తొలగిస్తాం. - **భానోజీరావు, ఈవోపీఆర్డీ** - న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

మాది గంగచోళ్లపెంట గ్రామం. బ్యాంకు రుణానికి వెళ్తే వన్‌బీ తీసుకు రమ్మన్నారు. ఆన్‌లైన్లో చూస్తే రావడం లేదు. గత ప్రభుత్వం చేసిన రీసర్వే సమయంలో ఏదో సమస్య వల్ల వన్‌బీ వెబ్‌ల్యాండ్ కావడం లేదని చెప్పారు. తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి సంతకం తీసుకున్నారు. ఇలా నాతోపాటు చాలామంది తిరుగుతున్నారు. - ఓ రైతు ఆవేదన

నా పొలంలో చిన్న గట్టు వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నా. పక్క రైతులకు, మాకు కలిపి ఒకే ఎల్పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) వచ్చింది. ఇదేమని అడిగితే కంబైన్డ్ ఎల్పీఎం అంటున్నారు. దీని వల్ల ఎవరి విస్తీర్ణం ఎంతో తెలియని పరిస్థితి నెలకొంది. - దత్తిరాజేరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు

రీసర్వేలో లోపాలు.. సవరణకు చర్యలు

రైతుల నుంచి వినతుల స్వీకరణ, పరిష్కారానికి ప్రభుత్వం కార్యాచరణ



గజపతినగరంలో పొలాలు పరిశీలిస్తున్న అధికారులు (పాతచిత్రం)

న్యూస్‌టుడే బృందం, గజపతినగరం

గత వైకాపా ప్రభుత్వం జగనన్న భూరక్ష పేరుతో నిర్వహించిన భూముల రీసర్వే వల్ల రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రక్రియ అంతా తప్పుల తడకగా జరగడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమందికి ఉన్నదాని కంటే తక్కువ, ఎక్కువ భూమి నమోదు కావడం, జిరాయితీ భూమి డీపట్టా, ప్రభుత్వ భూమిగా నమోదు కావడం వంటి సమస్యలున్నాయి. ఇప్పుడు ఆ లోపాలను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సర్వేలో ఏర్పడ్డ సమస్యల పరిష్కారానికి శనివారం నుంచి గ్రామసభలు నిర్వహించి, రైతుల నుంచి వినతులు స్వీకరించాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. ఇందులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ, అక్కడికక్కడే పరిష్కరించగలిగితే వెంటనే పరిష్కరించడం, లేకుంటే ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నారు.

నియోజకవర్గంలో ఇలా

మండలం	మొత్తం రెవెన్యూ గ్రామాలు	రీసర్వే చేసిన ఊర్లు
గజపతినగరం	35	25
దత్తిరాజేరు	46	7
బొండపల్లి	33	18
గంట్యాడ	45	22

గ్రామ సభలు నిర్వహిస్తాం

రీసర్వే వల్ల వచ్చిన సమస్యలను ఇప్పటికే పరిశీలిస్తున్నాం. జాయింట్ ఎల్పీఎంలు ఉన్నట్లు దరఖాస్తులు చేసిన రైతులను ఆన్‌లైన్లో విడదీసి, ఎల్పీఎంలు ఇస్తున్నాం. గ్రామసభలు పెట్టి రైతుల నుంచి వచ్చిన సమస్యలను గుర్తించి, తాత్కాలిక పరిష్కారం చేయగలిగిన వాటిని అక్కడే పరిష్కరిస్తాం. సాధ్యం కాని సమస్యలపై నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తాం. శనివారం నుంచి గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. - రత్నకుమార్, నీలకంఠేశ్వరరెడ్డి, రాజేశ్వరరావు, విజయభాస్కర్, తహసీల్దార్లు, గజపతినగరం, గంట్యాడ, బొండపల్లి, దత్తిరాజేరు

తుప్పల తొలగింపు

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పేరుకుపోయిన తుప్పలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. ఇక్కడ పరిసరాలు అధ్వానంగా ఉండటం, తాగునీటి సమస్యతో రోగులు పడుతున్న ఇబ్బందులపై సెప్టెంబరు 15న 'అసౌకర్యాల ఆసుపత్రి' శీర్షికన 'ఈనాడు'లో కథనం వెలువడింది. దీనికి స్పందించిన అధికారులు పనిచేయని బోరును బాగుచేయించారు. ఆవరణలో మురుగుదొడ్డు, ఆవరణలో పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. దీంతో రోగులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రధాన వీధులు.. మురుగు కూపాలు



మురపాక గ్రామ ప్రధాన వీధుల్లో దారులు మురుగు, రాళ్లతో అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం పడినా వరద బయటకుపోయే మార్గంలేక మురుగుతో కలిసి నిల్వ ఉండిపోతోంది. దీంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంటు రహదారులు, కాలువలు నిర్మించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోయారు. రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు విడుదలైన వెంటనే సమస్య పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ ఏఈ కృష్ణమూర్తి అన్నారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

పిడుగుపాటుతో భయాందోళన



బీటలు వారిన గోడ

వంగర, న్యూస్‌టుడే: వంగర మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం పిడుగు పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని ఆవు పైడితల్లికి చెందిన జిరాక్స్ యంత్రం, శీతలీకరణ యంత్రం పాడయ్యాయి. ఇంటి గోడలు బీటలు వారాయి. సమీపంలోని గేదెల సత్యమ్మ అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించడంతో కోలుకున్నారు. పొట్టా చక్రధర్‌కు చెందిన ఫ్యాన్లతోపాటు టీవీ కూడా మరమ్మతులకు గురయ్యాయి. బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో మరో పిడుగు పడడంతో ఇంటర్నెట్ లేక ఎస్‌బీఐ బ్యాంకులో లావాదేవీలు నిలిచిపోయాయి.

బ్యాటరీ సైకిల్ వితరణ



విద్యార్థికి వాహనం అందజేసిన మదన్ తదితరులు

రాజాం, న్యూస్‌టుడే: డోలపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి పి.జగదీష్‌కు రూ.40వేలు విలువ జేసే నాలుగు చక్రాల బ్యాటరీ సైకిల్‌ను సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా పారిశ్రామికవేత్త లోలుగు మదన్ సమకూర్చారు. విద్యార్థి స్వగ్రామం పొనుగుటివలసలో జీఎంఆర్ కేర్ ఆసుపత్రి వైద్యుడు ఎస్.కిరణ్, గ్రామ పెద్దలతో కలిసి గురువారం అందజేశారు. జి.గున్నంనాయుడు, ఎస్.రమేష్‌కుమార్, కె.సతీష్‌కుమార్, జె.లక్ష్మునాయుడు, ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

బాడంగి (రామభద్రపురం), న్యూస్‌టుడే: బాడంగి గురుకుల పాఠశాలలో గురువారం అండర్-14, 17 బాలురు, బాలికల నియోజకవర్గ స్థాయి పోటీలను నిర్వహించారు. 80 మంది విద్యార్థులు పాల్గొనగా, 20 మంది బాలురు, బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నల్ల వెంకటనాయుడు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని డీవీఎం పాఠశాలలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పీడీలు వి.అప్పలనాయుడు, సత్యనారాయణ, బంగారునాయుడు, రాజేశ్వరి, నాగమణి పాల్గొన్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కుళాయిలు లేవు.. పూడిక తీయరు



మరుగుదొడ్డి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని కొత్త ఎరుకుల వీధి, మహారాణిపేట ప్రాంతాల్లో కమిషనర్ రామలక్ష్మి, పురపాలక అధికారులు గురువారం పర్యటించారు. కొత్త ఎరుకుల వీధిలోని బాలికల పాఠశాలలో సామాజిక మరుగుదొడ్డి నిర్మించాలని, కుళాయిలు ఏర్పాటు చేయాలని, నేతాజీ పాఠశాల ఎదురుగా బోరు వేయాలని, ప్రధాన కాలువలు శుభ్రం చేయాలని, పాడైన విద్యుత్తు స్తంభాలు తొలగించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఆమె కొత్త ఎరుకుల వీధిలో మరుగుదొడ్డి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

20న సంస్మరణ సభ

రాజాం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఈనెల 20న నిర్వహించనున్న గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని బహుజన నాయకులు డి.రామప్పడు, బి.బుద్ధుడు, ఉదయ్ భాస్కర్ తదితరులు పేర్కొన్నారు. రాజాం పట్టణంలో దీనికి సంబంధించిన గోడపత్రికలను గురువారం ఆవిష్కరించారు.

ఓటు ప్రాధాన్యంపై అవగాహన

చీపురుపల్లి: ఓటు హక్కు ప్రాధాన్యాన్ని యువత గుర్తించాలని తహసీల్దారు రాజారావు సూచించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన విద్యార్థులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. చీపురుపల్లి జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రధానాచార్యుడు ఎం.వినోద్‌బాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. డీటీ హర్షవర్ధిని పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: అతిసారంతో చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్లకు చెందిన బాధితులను సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు రమణ, గరివిడి డివిజన్ కార్యదర్శి ఎ.గౌరినాయుడు తదితరులు గురువారం పరామర్శించారు. వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

శుభ్రతపై ప్రత్యేక దృష్టి

తెర్లాం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై స్కావెంజర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవోలు జె.త్రినాథరావు, ఆర్.పాపారావు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వారికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేసిన పరికరాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్, సిబ్బంది ఉన్నారు.

అద్దె భవనంలోకి కేంద్రాన్ని మార్చండి

మెంటాడ, న్యూస్‌టుడే: శిథిలావస్థలో ఉన్న కంటుభుక్తవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్చాలని ప్రత్యేకాధికారి ప్రియాంకా గాంధీ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం గ్రామంలో ఎంపీఈపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచి కె.సత్యవతి, ఎంపీడీవో, తహసీల్దార్లు భానుమూర్తి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

41 మద్యం సీసాలు స్వాధీనం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి పట్టణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న జి.అగ్రహారానికి చెందిన ఒకరిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. ఆయన నుంచి 41 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కోడిశలో కొట్లాట

రేగిడి, న్యూస్‌టుడే: కోడిశ గ్రామంలో జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరువర్గాలపై పరస్పరం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 16న రాత్రి జరిగిన వివాహంలో కొందరి మధ్య ఏర్పడిన ఘర్షణతో ఇరువర్గాలు రాళ్లు విసురుకున్నారు. గ్రామ మాజీ సర్పంచి పెంటనాయుడు, పి.సోమేష్, ఎన్.సతీష్ తదితరులు గాయపడ్డారు. వీరిని రాజాం ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఇరువర్గాలు గురువారం పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. ఎన్.పెంటనాయుడు ఫిర్యాదులో ఎన్.సతీష్‌తోపాటు మరో నలుగురిపైన కేసులు నమోదు చేయగా.. ఎన్.సతీష్ ఫిర్యాదుతో పెంటనాయుడుతోపాటు మరో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నీలావతి తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టామన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

మెరకముడిదాం, రామభద్రపురం, బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మెరకముడిదాంలో పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో రూ.80 లక్షలతో సమావేశ మందిరం, రూ.70 లక్షలతో కోనేరు అభివృద్ధి, గట్టుపై సీసీ రహదారి నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. తెదేపా మండలాధ్యక్షుడు టి.సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ కె.మోతీలాల్‌నాయుడు, నాయకులు ఎం.రమణమోహనరావు, ధనుంజయ, చంద్రశేఖర్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

బొబ్బిలి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంటు రహదారులు, కాలువలు నిర్మిస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. రామభద్రపురం మండలంలోని తారాపురంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పల్లెల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. తారాపురంలో రహదారి పక్కన ఇళ్లను తొలగించడానికి అధికారులు కొంత మందికి ఎక్కువ నగదు, మరికొందరికి తక్కువ మొత్తం మంజూరు చేశారంటూ సర్పంచి బి.రమణమ్మ, సీతారామ్ బేబినాయన దృష్టికి తీసుకొచ్చారు. ఆర్డీవోతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. చింతల రామకృష్ణ, ఎం.తిరుపతిరావు, కె.భాస్కరరావు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. బొబ్బిలి మండలం మెట్టవలసలో రూ.30 లక్షలతో సిమెంటు రహదారి నిర్మాణానికి బేబినాయన శంకుస్థాపన చేశారు. సర్పంచి పి.మాధవరావు, ఎ.భాస్కరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తారాపురంలో పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బేబినాయన తదితరులు

అధ్వాన రహదారులతో నరకయాతన



పురిటిపెంట ప్రధాన మార్గం దుస్థితి

న్యూస్‌టుడే, గజపతినగరం

గజపతినగరం, పురిటిపెంట న్యూకాలనీల్లో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లుగా రహదారులకు మరమ్మతులు లేక నిత్యం నరకం చూస్తున్నారు. మరోపక్క మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి పురిటిపెంట గ్రామం వరకు ఉన్న మెంటాడ రోడ్డులో పూర్తిగా గోతులు, వాహనాల రాకపోకలతో దుమ్ముధూళి రేగడంతో అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఏడాదిన్నరగా సమస్య ఉన్నా పట్టించుకున్న నాథుడు లేడని అసహనం వ్యక్తం చేశారు.

కాలనీలు.. సమస్యల నిలయాలు

పురిటిపెంట న్యూకాలనీలోని బాలాజీనగర్, చంపావతినది ఒడ్డున ఉన్న వీధుల్లో రహదారులు మరమ్మతులకు గురయ్యాయి. చాలా కాలం నాటివి కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. షరాబుల కాలనీ, కొత్తరోడ్డు, సంతతోట కాలనీలో నడవలేని దుస్థితి. వీధి కాలువలు లేకపోవడంతో మురుగునీరు రహదారులపైకి వస్తోంది. ఇక్కడ కాలువలు నిర్మించాల్సి ఉంది. గజపతినగరంలో మేదర వీధి, బూర్లి వీధి, ఎస్సీ కాలనీ, దిగువవీధి, రాణా వీధుల్లో రహదారులు గోతులతో నిండి ఉన్నాయి. దిగువన ఉన్న సచివాలయానికి వెళ్లాలంటే కిలోమీటరు దూరం గోతుల్లో ప్రయాణించాల్సిందే. జయంతి కాలనీ, కుమ్మర వీధి ఇతర కాలనీల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు శిథిలం అయ్యాయి.

అధికారులు ఏమన్నారంటే?

మెంటాడ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు చేశామని ఆర్అండ్‌బీ ఏఈ నరసింహమూర్తి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. గజపతినగరం పంచాయతీలో ఇటీవల ఎం.వెంకటాపురం, బీసీ కాలనీల్లో రహదారులు నిర్మించామని, మిగిలిన రహదారులకు 'పల్లె పండగ'లో ప్రతిపాదనలు చేసినట్లు గ్రామ కార్యదర్శి జనార్దనరావు పేర్కొన్నారు. పురిటిపెంట పంచాయతీలోని న్యూకాలనీలో ఉన్న రహదారుల మరమ్మతులను పల్లె పండగ, ఇతర నిధులతో చేయించేందుకు పాలకవర్గం తీర్మానాలు చేసినట్లు కార్యదర్శి తిరుపతి చెప్పారు.

'వీవోఏ తీరుతో ఇబ్బందులు పడుతున్నాం'

గజపతినగరం, న్యూస్‌టుడే: రూ.300 ఇస్తే తప్ప బ్యాంకు రుణాలు ఇవ్వం, రూ.500 ఇస్తే పొదుపు రుణాలు, స్త్రీనిధి రుణాలు వచ్చేలా చేస్తామని వీవోఏ వేధింపులకు గురి చేస్తున్నారని పురిటిపెంట గ్రామానికి చెందిన ప్రగతి మహిళా సంఘ సభ్యులు బి.సంతోషి లక్ష్మి, కె.భవాని, ఎం.వెంకట రత్నం తదితరులు సీసీ రామునాయుడు వద్ద గురువారం ఏకరవు పెట్టారు. దర్యాప్తు నిర్వహించి, తగిన చర్యలు తీసుకుంటామని సీసీ సమాధానమిచ్చారు.

ఆదాయం రూ.2.11 లక్షలు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని నవదుర్గ ఆలయంలో ఇరుముడి ఆదాయం రూ.2,11,787 సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి పి.శ్యామలరావు తెలిపారు. లెక్కింపులో ఆలయ ధర్మకర్త వి.నరసింగరావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, రామచంద్రశర్మ, పర్యవేక్షకుడు కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దుకాణం వద్దంటూ ఆందోళన

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని బజారు కూడలిలో మద్యం దుకాణం వద్దంటూ గురువారం రాత్రి స్థానికులు ఆందోళన చేపట్టారు. లాటరీలో షాపును దక్కించుకున్న ఓ వ్యక్తి దుకాణం ఏర్పాటు చేసేందుకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో జనావాసాల మధ్య దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని మహిళలు హెచ్చరించారు.

పరామర్శ.. గుర్ల: అతిసారం వ్యాధి అదుపునకు చర్యలు తీసుకోవాలని భాజపా జిల్లా కార్యదర్శి మజ్జి రమేష్ బాబు, గజపతినగరం కన్వీనరు ప్రసాద్ కోరారు. గురువారం గుర్ల వైద్యశిబిరాన్ని సందర్శించిన ఆయన మరణించిన భాజపా నేత సి.అప్పారావు కుటుంబీకులను పరామర్శించారు.


విజేతలకు అభినందనలు



గ్రామపెద్దలు, ఉపాధ్యాయులతో క్రీడాకారులు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి టెన్నికాయిట్ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం, టీం ఛాంపియన్ షిప్‌లో రజత పతకాలు గెలిచిన కిలారి ఇందు, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న మరికొందరిని పెదనడిపల్లి గ్రామ పెద్దలు సత్కరించారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.రామారావు, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావును అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాగర్‌బాబు

తెర్లాం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ బి.సాగర్‌బాబు అన్నారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌సీ రాజు, ప్రధానాచార్యులు తిరుపతి, రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు. ● వంగర: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు మహిళా పోలీసులు బాధ్యత వహించాలని, అక్రమ మద్యం విక్రయిస్తే సమాచారం అందించాలని ఎస్ఐ షేక్ శంకర్ అన్నారు.

తెదేపాలో చేరిన ఎంపీటీసీ, వార్డు సభ్యులు

విజయనగరం అర్బన్, గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ మండలం పెంట శ్రీరాంపురం ఎంపీటీసీ సభ్యురాలు సిరిపురం శ్యామల, వార్డు సభ్యులు లగుడు దేముడు, గండిమాని లక్ష్మణ గురువారం తెదేపాలో చేరారు. విజయనగరంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో వారంతా తీర్థం పుచ్చుకున్నారు. వారి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు పార్టీలోకి వచ్చినట్లు మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కర నాయుడు తెలిపారు. మాజీ ఎంపీపీలు కొండలరావు, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కొండపల్లితో శ్యామల తదితరులు

అప్రమత్తతతోనే తెగుళ్ల నివారణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త తేజేశ్వరరావు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ముందస్తు జాగ్రత్తలను పాటించడంతో పంటలో సోకే తెగుళ్లను నివారించొచ్చని విజయనగరం గాజులరేగ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు అన్నారు. గురువారం బుడతనాపల్లి, పెణసాం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ పనులు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువగా దిగుబడులు సాధించొచ్చని చెప్పారు. ఏవో శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

బొబ్బిలి, న్యూస్‌టుడే: 11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో తీగలపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ ఈఈ అనంతరావు తెలిపారు. గాంధీ బొమ్మ ప్రాంతం, చీపురుపల్లి వీధి, వెలమవారివీధి, ఆసుపత్రి రోడ్డు, స్వామివారివీధి, సాయినగర్, టీఆర్ కాలనీ, మారుతీనగర్, నాయుడుకాలనీ, వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంతం, షాదీఖానా పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ● **రేగిడి:** 33 కేవీ లైనులో మరమ్మతుల నేపథ్యంలో రేగిడి మండలంలో శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 1.30 వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ శ్రీరాములు తెలిపారు.

ఈవోగా శ్రీనివాస్

రామభద్రపురం: రామభద్రపురం పంచాయతీ ఈవోగా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. రాజాం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. పక్కాగా పరిశుభ్రత పనులు చేయిస్తానని, తాగునీరు, వీధి దీపాల సమస్యలు రాకుండా చూస్తానన్నారు.



దుర్గాలమ్మకు చండీహోమం

పౌర్ణమి సందర్భంగా విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి వనంగుడిలో గురువారం దుర్గాలమ్మవారికి చండీహోమం నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ 3 గంటలపాటు ఈ క్రతువు సాగింది. భక్తులు తరలివచ్చి, దుర్గాలమ్మను ఆరాధించారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

విజయనగరం

● విజయనగరం ● నెల్లిమర్ల ● ఎస్.కోట

అలరించిన తోలుబొమ్మలాట

పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా గురువారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ వనంగుడిలో నిర్వహించిన తోలుబొమ్మలాట ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. కాకినాడకు చెందిన శ్రీనటరాజ నిలయ ఛార్మ చిత్ర కళా ప్రదర్శన కమిటీ ఆధ్వర్యంలో సుమారు గంట పాటు సాగింది. అనంతరం ప్రదర్శన నిర్వాహకులను దేవస్థానం అధికారులు సత్కరించారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

? వెంకటేశ్వర కాలనీ-6లో రహదారులు నిర్మించాలి. - **దొర, స్థానికులు**

● నిధుల లభ్యత మేరకు ప్రాధాన్య క్రమంలో రహదారుల నిర్మాణం చేపడతాం. - **పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ**

? అలకనందా కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - **శ్రీనివాసరావు, స్థానికుడు**

● దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం. - **రమణ, లైటింగ్ సూపర్ వైజరు**

–న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పూర్తిస్థాయిలో చెత్త తరలింపు

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: దాసన్నపేట రింగ్‌రోడ్డు ట్రాన్సిట్ స్టేషన్ సమీపంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. 'ఈనాడు'లో 17న 'ఇదేం చెత్త తరలింపు?' శీర్షికన ప్రచురితమైన కథనానికి కమిషనరు పి.నల్లనయ్య స్పందించి చర్యలు తీసుకున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

జామి, న్యూస్‌టుడే: జామి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జి.సురేష్ బాబు తెలిపారు.

దాసన్నపేట వెళ్లలేం

అంబటిసత్రం దాటలేం..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరంలో గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అంబటి సత్రం రహదారి విస్తరణకు నోచుకోలేదు. దాసన్నపేట ప్రాంతంలోని దారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. తాగునీటి పైపులైన్ల మరమ్మతుల కోసం గోతులు తీసి వదిలేస్తుండడంతో సమస్య తీవ్రమవుతోంది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల వారు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



అంబటి సత్రం దారిలో విస్తరణ పనులు పూర్తికాక కాలువల వద్ద పరిస్థితి

ట్రాఫిక్ సమస్య తీవ్రం..

అంబటిసత్రం రహదారి విస్తరణ పనులను ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించినా.. నేటికీ పూర్తికాలేదు. రూ.4 కోట్లతో 730 మీటర్ల పొడవున ప్రక్రియ పూర్తి చేయాలని అంచనా వేశారు. తొలి విడతగా రూ.85 లక్షల విలువైన పనులు చేశారు. మలివిడతలో రూ.3.16 కోట్లతో టెండర్లు పిలిచారు. ఒక లేయరు బీటీ వేశారు. అనంతరం వదిలేశారు. పూల్‌బాగ్ రోడ్డు, నెల్లిమర్ల, గరివిడి, రాజాం, శ్రీకాకుళం వైపునకు ఈ మార్గం గుండానే వెళ్లాలి. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. కాలువలను సైతం నిర్మించకపోవడంతో మురుగు రోడ్డెక్కుతోంది. ఇప్పిలివీధి, పల్లివీధి, చిన్నపల్లి వీధి, అద్దెపల్లివారి వీధి, యాత వీధి, రాజారావు మేడ తదితర ప్రాంతాల వారికి నిత్యం అవస్థలు తప్పడం లేదు.



దాసన్నపేట కూడలి నుంచి డబ్బూరీ వేడుకా మందిరానికి వెళ్లే రహదారి పరిస్థితి

ఎక్కడికక్కడే గుంతలు..

దాసన్నపేట దారిలో పెద్దఎత్తున గుంతలు కనిపిస్తున్నాయి. పైపులైన్ల మరమ్మతులకు గోతులు తీసి వదిలేస్తున్నారు. రైతుబజారు కూడలి నుంచి ఓ ప్రైవేటు వేడుకా మందిరం వరకు ఈ పరిస్థితి కనిపిస్తోంది. సింగపూర్ సిటీ దారిలో వర్షం పడితే రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. కల్వర్టులు సైతం పాడయ్యాయి. జగన్నాథ్ ఎన్‌క్లేవ్, డాల్ఫిన్స్ అపార్టుమెంటు తదితర ప్రాంతాల్లో ఈ సమస్య కనిపిస్తోంది. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని, విస్తరణ పనులు పూర్తిచేస్తామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

ఈ ట్యాంకు శుభ్రం చేసి నాలుగేళ్లు!

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: శృంగవరపుకోట పట్టణ శివారు పుణ్యగిరిలోని జీఎల్ఎస్ఆర్ ట్యాంకు. 20వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఈ ట్యాంకు శుభ్రపరిచి నాలుగేళ్లవుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. ట్యాంకు పైభాగం పగిలిపోయి శిథిలావస్థకు చేరింది. దీనిపైకి ఎక్కి శుభ్రం చేయడానికి వీలుకావడం లేదు. ఈ నీటిని ఇతర అవసరాలకు, బోరు నీటిని తాగునీటికి వినియోగిస్తున్నట్లు పుణ్యగిరి వాసులు తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీటీసీ సభ్యుడు దారగిరి మండల సమావేశంలో ప్రస్తావించినా అధికారుల నుంచి స్పందన కనిపించడం లేదు.



పుణ్యగిరి గ్రామంలో ట్యాంకు



శుభ్రపర్చిన తేదీలు లేని బర్మాకాలనీ ట్యాంకు

ఏడున్నా.. మూడింటిపైనే..

శృంగవరపుకోట పట్టణంలో ఏడు వరకు రక్షిత మంచినీటి పథకం ట్యాంకులున్నాయి. రక్షిత మంచినీటి విభాగం పర్యవేక్షణలో ఉన్న మూడు ప్రధాన ట్యాంకులు అడపాదడపా శుభ్రపరుస్తున్నా.. మిగతావి మాత్రం నెలలు, ఏళ్ల తరబడి పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ప్రతి 15 రోజులకోసారి శుభ్రపర్చాలి. బర్మాకాలనీలో ట్యాంకు నెలల తరబడి శుభ్రం చేయలేదన్నది అక్కడి బోర్డు చూస్తే తెలుస్తుంది. పట్టణంలో సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో ఉన్న రెండు, ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని ట్యాంకులు పైలట్ ప్రాజెక్టు సిబ్బంది శుభ్రం చేస్తున్నా ఏ ట్యాంకు మీద కూడా శుభ్రపర్చిన తేదీ నమోదు చేయడం లేదు. రక్షిత మంచినీటి విభాగం జేఈ యూన్నీ వద్ద ప్రస్తావించగా ప్రధాన ట్యాంకులు మూడు క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నారని, మిగతా వాటి గురించి ఈవోపీఆర్డీ, పంచాయతీ ఈవోల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న పైడి వసంత అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. గుంటూరులో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి 1000 మీటర్ల పరుగు పోటీలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని అందుకుంది. అయ్యన్నపేట ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న నిఖిలశ్రీ తిరుపతిలో నిర్వహించిన త్రైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.

డెంకాడ: విజయవాడలో ఇటీవల జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆవాల యశోద ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ ఆదినారాయణ తెలిపారు. యశోదను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



వసంత నిఖిలశ్రీ

పంచాయతీ కార్యదర్శిపై దర్యాప్తు

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని బానాది పంచాయతీ కార్యదర్శి ఎ.ఎస్.ఎస్.ఎన్.మూర్తిపై డీఎల్‌పీవో ఎ.మోహనరావు గురువారం దర్యాప్తు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదని, పాలక సమావేశాలు నిర్వహించకపోవడంతో గ్రామాభివృద్ధి కుంటుపడిందని సర్పంచి కర్రి యశోదతో పాటు పలువురు వార్డుసభ్యులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి వచ్చిన ఆయన ఫిర్యాదుదారుల అభిప్రాయాలను సేకరించారు. పంచాయతీ దస్త్రాల గురించి ఆరా తీయగా ఆడిటర్ వద్ద ఉన్నాయంటూ కార్యదర్శి బదులిచ్చారు. ఎంపీటీసీ సభ్యురాలు కోనం తులసిని కలిసి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా అధికారులకు సమగ్ర నివేదిక అందిస్తామన్నారు.



బానాదిలో దర్యాప్తు నిర్వహిస్తున్న డీఎల్‌పీవో మోహనరావు

వృత్తి పన్ను బకాయి రూ.17 లక్షలు



మాట్లాడుతున్న జిల్లా జీఎస్టీ ఏసీ అచ్చయ్య

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస మండలంలో సుమారు రూ.17 లక్షల మేర వృత్తి పన్ను బకాయి ఉందని జిల్లా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) శాఖ ప్రాంత సహాయ కమిషనర్ జి.అచ్చయ్య చెప్పారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడుతూ వృత్తిపన్ను సకాలంలో చెల్లించి రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. బకాయిల డ్రైవ్‌లో సుమారు రూ.లక్ష వసూలు జరిగినట్లు తెలిపారు. దీంట్లో సహాయ ఉప కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు, వర్తక సంఘం కార్యదర్శి విన్నకోట గౌతమ్, కోశాధికారి రేపాక శ్రీనివాసరావు, కొల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బత్తివలసలో ప్రభుత్వ భూమి స్వాధీనం

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: మండలంలోని పెదబత్తివలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 44, 45, 46లో సుమారు ఆరెకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక తహసీల్దారు గోవింద్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో సర్వే నిర్వహించి ఆక్రమణ ప్రభుత్వ భూమిని గుర్తించామని తెలిపారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీచేసి, బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఆర్ఐ మాధురి, వీఆర్వో శ్రీను, సర్వేయర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

కలుషిత నీటిపై అప్రమత్తత అవసరం

కొత్తవలస, న్యూస్‌టుడే: తుపాను వల్ల కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై మలేరియా, డెంగీ, గన్యా జ్వరాలు, డయేరియా, కామెర్లు వంటి అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని [illegible] పేట వైద్యాధికారి కె.గోపాలకృష్ణ, కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీతాదేవి గురువారం చెప్పారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇళ్ల ముందు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. చేపలు, మాంసం, గోంగూర, నిల్వ ఆహార పదార్థాలు తినొద్దని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు పారిశుద్ధ్యం, నీటి వనరుల క్లోరినేషన్ చేయించాలని చెప్పారు.



గోపాలకృష్ణ

జడ్పీ వాణిజ్య సముదాయంపై కదలిక

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలసలో జడ్పీ నిర్మించిన వాణిజ్య సముదాయంపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. సుమారు రూ.78 లక్షల అంచనాతో 14 దుకాణాల వాణిజ్య సముదాయాన్ని నిర్మించి నెలలు గడిచినా ఔత్సాహిక వ్యాపారులకు కేటాయించకపోవడంతో నెలకు రూ.80,640 ఆదాయాన్ని జడ్పీ కోల్పోతోంది. దీనిపై '14 దుకాణాలు.. రూ.78 లక్షలు' శీర్షికతో 7న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు స్పందించి డిపాజిట్‌దారులకు అప్పగించాలని సీఈవోను ఆదేశించారు. సీఈవో బి.వి.సత్యనారాయణ బుధవారం కొత్తవలస వచ్చి వాణిజ్య సముదాయాన్ని పరిశీలించారు. విద్యుత్తు మీటర్ల కోసం ఈపీడీసీఎల్‌కి దరఖాస్తు చేయాలని డీఈ సీహెచ్.వి.స్వామినాయుడుకు సూచించారు. డిపాజిట్‌దారులు సీఈవోను కలిసి సాధ్యమైనంత తొందరగా అప్పగించాలని కోరారు. రెండు దుకాణాలకు మీటర్లకు దరఖాస్తు చేయొద్దని, ఎక్కువ లోడ్ అవసరం ఉన్నందున ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకుంటామని చెప్పడంతో సీఈవో అంగీకరించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని సంప్రదించి ఈనెల 27 తర్వాత ప్రారంభోత్సవానికి తేదీ నిర్ణయించి తెలియజేయాలని డీఈకి చెప్పారు. ఎంపీడీవో ఎస్.రమణయ్య, పంచాయతీ కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్ డీఈ స్వామినాయుడుతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

ఈనాడు కథనానికి స్పందన

ఉత్సాహంగా పాఠశాల క్రీడలు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ అండర్- 14, 17 జిల్లా జట్ల ఎంపిక పోటీలు గురువారం నగరంలో ప్రారంభమయ్యాయి. రాజీవ్ మైదానంలో జరిగిన బాక్సింగ్ ఎంపికలకు 100 మంది బాల, బాలికలు తరలి వచ్చారు. కోడి రామ్మూర్తి వ్యాయామశాలలో అండర్-17 జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ జట్టును ఎంపిక చేశారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు, డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

20న బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

శృంగవరపుకోట: రాష్ట్ర సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ మెన్, ఉమెన్ టోర్నమెంటుకు జిల్లా జట్ల ఎంపికలు 20న ఎస్.కోట మండలం భవానీ నగర్‌లో డాక్టరు వరలక్ష్మి వ్యాయామ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీనివాస్, జి.లక్ష్మణరావులు తెలిపారు.

గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. గురువారం సాయంత్రం విజయనగరం మండలంలోని చెల్లూరు, బడ్డుకొండపేట, ముడిదాం, సుంకరిపేటలో పల్లె పండగ నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రత్యేకాధికారిణి అరుణకుమారి, ఎంపీడీవో చంద్రకళ, ఈవోపీఆర్డీ తిరుపతినాయుడు పాల్గొన్నారు.



సుంకరిపేటలో జరిగిన పల్లె పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

పల్లెలకు మహర్దశ

శృంగవరపుకోట, న్యూస్‌టుడే : పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారతాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం అలుగుబిల్లిలో రూ.60 లక్షలు, వినాయకపల్లిలో రూ.25 లక్షలు, తలారిలో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అలుగుబిల్లిలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎడ్ల బండిపై ఎమ్మెల్యేను ఊరేగింపుగా తీసుకువెళ్లారు.



అలుగుబిల్లిలో ఎడ్లబండిపై ఊరేగింపుగా వెళ్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

నూతన రహదారుల నిర్మాణం

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: గ్రామాల్లో నూతన రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే లోకం మాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. గురువారం మండలంలోని కొణతాలపాలెంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.



రోడ్డు పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మార్క్‌ఫెడ్ ఛైర్మన్


పనులకు భూమిపూజ

వేపాడ, డెంకాడ, జామి, లక్కవరపుకోట: వేపాడ మండలంలోని అంకాజోశ్యులపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ గురువారం భూమిపూజ చేశారు. వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ❖ డెంకాడ మండలం మోపాడ, బంగార్రాజుపేట, డి.తాళ్లవలస, డి.కొల్లాం, గునుపూరు, డెంకాడ పంచాయతీల్లో పలు పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ❖ జామి మండలం గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని మొకాసకొత్తవలస, అన్నమరాజుపేట, వెంకటరాజుపాలెం, జన్నివల, శాసనాపల్లిల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ❖ ఎల్.కోటలో రూ.40 లక్షల విలువ చేసే పనులకు జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వరరావు, ఎల్.కోట సర్పంచి కెర్రు పార్వతి శంకుస్థాపన చేశారు.



భూమి పూజ చేస్తున్న గొంప కృష్ణ

నియామకం



విజయనగరం ఉడాకాలనీ: జాతీయ మానవ హక్కులు, అవినీతి, నేర నియంత్రణ బ్యూరో ఆఫ్ ఇండియా సంస్థ జిల్లా అధ్యక్షుడిగా పి.వెంకటరమణ నియమితులయ్యారు. జాతీయ అధ్యక్షుడు కె.ఎస్.జ్యోతీశ్వరరెడ్డి నుంచి నియామక పత్రం అందినట్లు తెలిపారు.

జిల్లాస్థాయి పాడిరైతుల సదస్సు

జామి: జామిలోని బూసర్ల రమణారావు కల్యాణ మండపంలో జిల్లా స్థాయి పాడి రైతుల సదస్సు శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా రైతు సంఘం కార్యదర్శి బద్దరాజు రాంబాబు గురువారం తెలిపారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన

కొత్తవలస: ప్రత్యేక పునశ్చరణలో భాగంగా ప్రగతి కళాశాలలో ఓటు హక్కు నమోదుపై తహసీల్దారు బి.నీలకంఠరావు అవగాహన కల్పించారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండుతున్న వారంతా ఓటర్లుగా నమోదు కావొచ్చని తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద 2021 అక్టోబరులో 90 కిలోల గంజాయితో కారును వదిలి పారిపోయిన కేసులో నిందితుడు కృష్ణను గురువారం అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు సీఐ వి.నారాయణమూర్తి తెలిపారు.

హిందీ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

శృంగవరపుకోట: రాష్ట్ర వికాస్ పరిషత్ సంస్థ నిర్వహించిన హిందీ పరీక్షల్లో వరలక్ష్మి పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ వై.జానకీదేవి తెలిపారు. 80 మంది విద్యార్థులు పాల్గొనగా వి.వందన శ్రీఅక్షయ, పి.అమూల్య పతకాలు సాధించారని, 35 మంది ప్రథమ శ్రేణి పొందారన్నారు.

సంక్షిప్త సమాచారం

వాల్మీకి జయంతి

విజయనగరం గ్రామీణం, అర్బన్: రామనారాయణంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాస్‌రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు. ● మహారాజా సంస్కృత కళాశాలలో ప్రధానాచార్యుడు జనార్దన నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

నట్టల నివారణ మందులు

లక్కవరపుకోట: గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందులు అందజేస్తోందని కాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి గాయత్రి తెలిపారు. గురువారం ఖాసాపేటలో 850 గొర్రెలకు, 250 మేకలకు నట్టల నివారణ మందులు సిబ్బందితో కలసి వేశారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

కొత్తవలస, జామి, వేపాడ: గతంలో రీ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు బి.నీలకంఠరావు, కృష్ణలత, రాములమ్మ తెలిపారు.

ఆరోగ్యంపై దృష్టి అవసరం

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: బాలికలు కౌమార దశలో ఆరోగ్యంపై దృష్టి సారిస్తే.. దీర్ఘకాలిక వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చని ఆర్‌బీఎస్‌కే కౌన్సిలర్ బి.కొండమ్మ సూచించారు. ఈ మేరకు నగరంలోని దాసన్నపేట బాలికల పాఠశాలలో గురువారం అవగాహన కల్పించారు. పౌష్టికాహారం, పరిసరాల శుభ్రత, విద్య, క్రమశిక్షణ, రక్తహీనత నివారణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఏఎన్ఎం కాంతమ్మ, చినతల్లి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ కొండమ్మ

పుస్తకాలతో మెరుగైన విజ్ఞానం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కాలాన్ని వృథా చేయడం మంచిది కాదని, మెరుగైన విజ్ఞానం కోసం పుస్తకాలు చదవాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ పిలుపునిచ్చారు. గురువారం అయ్యన్నపేట కూడలిలో థెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనార్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి జరిగింది. త్యాడ ప్రసాద్ పట్నాయిక్, వేణుగోపాలం తదితరులు పాల్గొన్నారు.



సంచార గ్రంథాలయం వద్ద రమణ, స్థానికులు

ప్రయాణికుల వినతుల పరిశీలన

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమంలో వచ్చిన వినతులను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి సకాలంలో పరిష్కరిస్తామని డీఎం కె.రమేష్ తెలిపారు. ఎస్.కోట నుంచి విజయనగరం మీదుగా గుమ్మలక్ష్మీపురం లేదా నీలకంఠాపురానికి ఎక్స్‌ప్రెస్, కేజీ పూడి మీదుగా దేవరాపల్లికి, తిమిడి మీదుగా విజయనగరానికి పల్లె వెలుగు బస్సులు కావాలని వినతులు వచ్చాయన్నారు.

విద్యార్థులకు 'అపార్' గుర్తింపు సంఖ్య

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: 9, 10 తరగతుల విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ ఎకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) గుర్తింపు సంఖ్యలు ఇస్తున్నట్లు డిప్యూటీ డీఈవో కేవీ రమణ తెలిపారు. గురువారం ఎల్.కోట కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అపార్ ఐడీ ద్వారా విద్యార్థి పూర్తి వివరాలు, పరీక్షల్లో వచ్చిన మార్కులు, పది, తొమ్మిదో తరగతి ధ్రువీకరణ పత్రాలు అందులో నమోదవుతాయని తెలిపారు. పదోతరగతి బాలికల సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈవోలు కూర్మారావు, శ్రీనివాస్, ప్రత్యేక అధికారిణి ప్రవీణ తదితరులు ఉన్నారు.



పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో రమణ

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేకాధికారి పి.కూర్మినాయుడు సూచించారు. గురువారం కొత్తపేటలో గ్రామ సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలంతా సమయపాలన పాటించాలన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ఉపాధిహామీ పనుల్లో భాగంగా సీసీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, ఈవోపీఆర్డీ జి.శంకర్ జగన్నాథ్, తహసీల్దార్ సుదర్శనరావు, పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు చేస్తున్న కూర్మినాయుడు

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

కొత్తవలస, న్యూస్‌టుడే: మండలంలోని గులివిందాడలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు గురువారం మొదలయ్యాయి. గ్రామంలోని గవర ఇంటిపేరున్న వారి ఆడపడుచుగా గౌరీదేవిని భావించి పూర్వీకుల నుంచి పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. లక్ష్మీదేవికి ప్రతిరూపంగా భావించే వరిదుబ్బును గవర కుందన చేతుల మీదుగా బుధవారం తీసుకొచ్చి ఉత్సవాలు నిర్వహించేచోట ఉంచారు. గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాన్ని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.



ఉత్సవాల కోసం తీసుకొచ్చిన విగ్రహం

తక్షణమే నెల్లిమర్ల జూట్‌మిల్లు తెరిపించాలి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల జూట్ మిల్లును తక్షణమే తెరిపించాలని వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముడి సరకు కొరత కారణంగా రెండు వారాలు మిల్లును మూసివేస్తామని నోటీసు ద్వారా తెలియజేసిన యాజమాన్యం ఆరు నెలలైనా తెరవకపోవడం దారుణమన్నారు. వామపక్షాల నాయకులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కనకల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు